హనుమాన్ జయంతి సంబరాలు

- ఆంజనేయస్వామి ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- జైశ్రీరామ్ నామస్మరణతో మార్మోగిన దేవాలయాలు
- స్వామివారికి విశేష పూజలు

ఆదోని అర్బన్: హనుమాన్ జయంతి వేడుకలను శనివారం వాడవాడలా ఘనంగా జరుపుకున్నారు. ఆదోని పట్టణంలోని హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. జైశ్రీరామ్ నామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. రణమండల ఆంజనేయస్వామి కొండపై వెలసిన స్వామివారికి పంచామృతాభిషేకం, సింధూరసేవ, వడలహారం, తులసీహారం, ఆకుపూజ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా ఇందిరానగర్‌లోని అభయాంజనేయస్వామికి భక్తులు పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం రథోత్సవం నిర్వహించారు.
–గోనెగండ్ల: మండలంలోని అలువాల, పెద్దనేలటూర్, గాజులదిన్నె, హెచ్. కైరవాడి, వేముగోడు, కులుమాల, గంజిహళ్లి తదితర గ్రామాల్లోని హనుమాన్ దేవాలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. గోనెగండ్లలోని సీతారామాంజనేయ స్వామి ఆలయంలో స్వామివారికి పంచామృతాభిషేకం చేశారు. వెండి అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. వీవర్స్ కాలనీలో స్వామివారికి ఆకుపూజ, సింధూర అలంకరణ చేశారు.
–కౌతాళం: మండల కేంద్రం కౌతాళంతో పాటు అగసలదిన్నె, సుళేకేరిలోని బుడుములదొడ్డి ఆంజనేయస్వామి, ఎరిగేరిలోని పులిగట్టు ఆంజనేయ స్వామి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.
–పెద్దకడబూరు: మండల పరిధిలోని తారాపురంలోని గిడ్డాంజనేయస్వామి, బసలదొడ్డిలోని హైరయ్య ఆంజనేయస్వామి, చిన్నకడబూరు, జాలవాడి, పెద్దకడబూరు గ్రామాల్లోని ఆలయాల్లో ఉదయం నుంచి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. రాత్రి భజనలు జరిగాయి.
–కోసిగి: స్థానిక కడపాళెంలో వీధిలోని ఆంజనేయస్వామి, మార్కండేయస్వామి ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది. జై శ్రీరామ్..జై హనుమాన్ నినాదాలు హోరెత్తాయి.
–ఎమ్మిగనూరుటౌన్: సోగనూరు రోడ్డులోని వజ్ర అభయరూప ఆంజనేయస్వామి ఆలయంలో పంచామృతాభిషేకం, ఆకుపూజలు జరిగాయి. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.
–ఎమ్మిగనూరురూరల్/ఎమ్మిగనూరు: పట్టణంలోని సోగనూరు రోడ్డు, వీవర్స్ కాలనీ, అన్నమయ్య సర్కిల్, బొడ్రాయి, సోమప్ప నగర్‌లోని ఆంజనేయస్వామి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఒంటెలు, కర్రసాము, బాలికల కోలాటాల, యువకుల నృత్యాలతో ఊరేగింపు సాగింది.
–నందవరం: నందవరంతో పాటు నాగలదిన్నె, రాయచోటి, గురజాల, జొహరాపురం, ముగతి, గంగవరం తదితర గ్రామాల్లో జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. సాయంత్రం హనుమాన్ చిత్రపటాలతో గ్రామ వీధుల్లో ఊరేగించారు.



పెద్దకడబూరు: హనుమాన్ చిత్రపటం ఊరేగింపులో భక్తులు, ఆదోని: ఇందిరానగర్‌లో అన్నదానం,


గోనెగండ్ల: వెండి అలంకరణలో స్వామివారు


ఆదోని: రణమండల ఆంజనేయస్వామి


ఎమ్మిగనూరులో స్వామివారి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు


కౌతాళం: బాపురంలో హోమ పూజలు


కోసిగి: కడపాళెంలో..






నందవరం: హనుమాన్ చిత్రపటంతో ఊరేగింపు, ఎమ్మిగనూరు: ఆలయంలో స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకులు, పట్టణంలో స్వామివారి ఊరేగింపు, హనుమంతుడి వేషధారణలో చిన్నారి, ఎమ్మిగనూరు: కోలాటం ఆడుతున్న మహిళలు, యువతులు

క్లుప్తంగా

గోనెగండ్లకు చేరిన విద్యా కానుక కిట్లు


విద్యా కానుక కిట్లను పరిశీలిస్తున్న సిబ్బంది

గోనెగండ్ల: విద్యా కానుక కిట్లు శనివారం గోనెగండ్లకు చేరినట్లు ఎంఈఓలు రామాంజనేయులు, నీలకంఠ తెలిపారు. మండలంలోని 55 ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 10,691 మంది విద్యార్థులకు విద్యా కానుక కిట్లు వచ్చినట్లు వెల్లడించారు. విద్యా కానుక కిట్లను స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భద్రపరిచినట్లు చెప్పారు. కానుకలో యూనిఫాం, స్కూల్ బ్యాగు, నోట్ పుస్తకాలు, షూస్, రెండు జతల సాక్సులు, బెల్ట్, డిక్షనరీ ఉంటాయని పేర్కొన్నారు. ఇందులో మొదటగా బ్యాగులు వచ్చాయని తెలిపారు. విద్యా కానుకలను వేసవి సెలవుల అనంతరం బడితెరిచిన రోజునే పంపిణీ చేస్తామన్నారు. సీఆర్పీ రవి, గోవింద రాజు తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగ విత్తనాలు పంపిణీ


వేరుశనగ కాయలను పంపిణీ చేస్తున్న సిబ్బంది

గోనెగండ్ల: మండలంలో వేరుశనగ విత్తనాలు పొందిన రైతులు తప్పనిసరిగా ఈ ఖరీఫ్ సీజన్‌లో విత్తుకోవాలని వ్యవసాయ అధికారిణి హేమలత కోరారు. శనివారం మండలంలోని ఆయా గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల్లో వేరుశనగ విత్తనాలను ఆర్‌బీకే సిబ్బంది రైతులకు పంపిణీ చేశారు. మండలానికి 275 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలను ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు. వేరుశనగ విత్తనాల కోసం ఆర్‌బీకేల్లో రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు సబ్సిడీతో పంపిణీ చేశామన్నారు. విత్తనాలు పొంది పంటసాగు చేయలేదని తేలితే వచ్చే ఏడాది విత్తనాలు పొందే అర్హత కోల్పోతారని చెప్పారు.

వైఎస్సార్‌సీపీ గెలవాలని పూజలు


టెంకాయలను సమర్పిస్తున్న నాగరాజ్ గౌడ్

కౌతాళం: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలో రావాలని.. ఎమ్మెల్యేగా బాలనాగిరెడ్డి గెలుపొందాలని కోరుతూ ఉరుకుంద ట్రస్టుబోర్డు చైర్మన్ నాగారాజ్‌గౌడ్, సభ్యులు ఈరన్నస్వామికి 101 టెంకాలయ సమర్పించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్టుబోర్డు సభ్యులు వెంకోబ, నర్సమ్మ, విజేంద్రరెడ్డి, లక్ష్మిరెడ్డి, రెడ్డి గీత, నరసింహులు, మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పులికనుమ ద్వారా నీటి మళ్లింపు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో తాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా పులికనుమ రిజర్వాయర్‌లో ఉన్న నీటిని ఎల్లెల్సీకి మళ్లించడంతో కాలువా ద్వారా నీరు వస్తుందని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి శనివారం తెలిపారు. మున్సిపల్ డీఈ మనోహర్‌రెడ్డితో పాటు ఏఈలు, సిబ్బంది కాలువా వెంట నీటి సరఫరాను పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. రెండు, మూడు రోజుల్లో పులికనుమ ద్వారా వచ్చే నీరు గుడికల్ చెరువు, ఎస్ఎస్ ట్యాంక్‌లకు మళ్లించడం జరుగుతుందని పేర్కొన్నారు. నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని కమిషనర్ తెలిపారు.

ఆధ్యాత్మికతతో ప్రశాంతత

ఆదోని సెంట్రల్: ఆధ్యాత్మికతతో ప్రశాంతత లభిస్తుందని కర్నూలు కతోలిక మేత్రసన పీఠాధిపతి గోరంట్ల జ్వాన్నేసు అన్నారు. కర్నూలు కతోలిక పీఠానికి 52వ పీఠాధిపతిగా ఎన్నికైన అనంతరం శనివారం ఆదోని పట్టణానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా కతోలిక బాలఏసు చర్చి రెవరెండ్ ఫాదర్ కోల విజయరాజు ఆధ్వర్యంలో ఆయనకు ఘనస్వాగతం పలికారు.

టీబీ డ్యామ్‌కు 360 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

హొళగుంద: కర్ణాటక రాష్ట్రం హోస్పేట వద్దనున్న తుంగభద్ర రిజర్వాయర్ (టీబీ డ్యాం)కు 360 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఇన్‌ఫ్లో జీరో ఉండగా ఎగువ భాగంలో కురిసిన వర్షాలకు శనివారం డ్యామ్‌లోకి నీరు వచ్చి చేరుతోంది. జిల్లా పశ్చిమ ప్రాంత ప్రజలకు తాగు, సాగు నీరందించే తుంగభద్ర దిగువ కాలువ(ఎల్లెల్సీ) కింద రైతులు 2023 రబీ వరకు రెండు పంటలను పండించారు. ఈసారి ఖరీఫ్‌కు మాత్రమే నీరందాయి. డ్యామ్‌లో ఇన్‌ఫ్లో మొదలు కావడంతో రైతులు మళ్లీ తుంగభద్ర డ్యామ్ వైపు ఆశగా చూస్తున్నారు. సకాలంలో డ్యామ్ నిండితే జూలై మొదటి, రెండో వారంలో ఎల్లెల్సీకి నీటిని వదులుతారు. శనివారం టీబీ డ్యామ్‌లో 1633 అడుగులకు గాను 1577.40 అడుగులు, 105.788 టీఎంసీల నీటి సామర్థ్యానికి గాను 3,338 టీఎంసీల నీరు నిల్వ ఉంది. అవుట్‌ఫ్లో 25 క్యూసెక్కులుండగా 360 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో నమోదైంది.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించం


హాజరైన రాజకీయ పార్టీల నాయకులు

- రాజకీయ పార్టీల నాయకులతో డీఎస్పీ
- బహిరంగ సమావేశాలు, విజయోత్సవ ర్యాలీలు నిషేధం


మాట్లాడుతున్న డీఎస్పీ శివనారాయణస్వామి

ఆదోని రూరల్: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించబోమని ఆదోని డీఎస్పీ శివనారాయణస్వామి అన్నారు. శనివారం పట్టణంలోని మహేశ్వర కళ్యాణ మండపంలో వివిధ పార్టీలకు చెందిన రాజకీయ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత కూడా 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. గ్రామంలో నలుగురు కంటే ఎక్కువ మంది గుమిగూడి ఉండరాదన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడకూడదన్నారు. ఈనెల 4వ తేదీ ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం కూడా గెలుపొందిన పార్టీ వారు టపాసులు, బాణసంచాలు పేల్చకూడదని తెలిపారు. ఊరేగింపులు చేయరాదన్నారు. ప్రతి ఒక్కరూ శాంతియుతంగా మెలగాలని, లేనిపక్షంలో పోలీసులు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పోలీసుశాఖ వారికి సహకరించాలని కోరారు. సమావేశంలో రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి, ఇస్వీ, పెద్దతుంబళం, రూరల్, తాలూకా ఎస్ఐలు శ్రీనివాసులు, చిన్నపీరయ్య, ఎర్రిస్వామి పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ. 55.61లక్షలు


కానుకల లెక్కింపులో పాల్గొన్న సిబ్బంది

కౌతాళం: ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయం హుండీలోని కానుకలను శనివారం కాలక్షేపవు మండపంలో లెక్కించారు. నగదు రూపంలో రూ.55,61,130, అలాగే బంగారం 13.7 గ్రాములు, వెండి 11.490కేజీలు వచ్చినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ హెచ్.జి.వెంకటేష్, తెలిపారు. అన్నదానం హుండీ నుంచిరూ. 1,13,207 వచ్చినట్లు తెలిపారు. ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్ ఆధ్వర్యంలో హుండీల్లో కానుకల లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు.

అధిక ధరలకు విత్తనాలు విక్రయిస్తే చర్యలు

- ఏడీఏ మహ్మమద్ ఖాద్రి


నందవరంలోని విత్తనాల దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏడీఏ, ఏఓ

నందవరం: రైతులకు విత్తనాలు, ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏడీఏ మహమ్మద్ ఖాద్రి హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ నరసింహ స్వామి సీడ్స్ దుకాణాన్ని మండల వ్యవసాయాధికారిణి మల్లి స్రవంతితో కలిసి తనిఖీ చేశారు. రికార్డులు, మూల ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైందని.. రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలను అందుబాటులో ఉంచాలన్నారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. నాణ్యమైన ఎరువులు, విత్తనాలను ఎమ్మార్పీకే విక్రయించాలని ఆదేశించారు. ఒకే రకమైన విత్తనాలు ఇవ్వాలని, వాటికి వేరొక విత్తనం జత కలిపి ఇవ్వారాదని చెప్పారు. రైతులకు విక్రయించే విత్తనాలకు బిల్లు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. ప్రతి రైతుకు బిల్లుపై సంతకం చేసి ఇవ్వాలన్నారు.

ఆర్బీకే సిబ్బందికి శిక్షణ


శిక్షణ ఇస్తున్న ఏడీఏ మహమ్మద్ ఖాద్రి

నందవరం: రైతులు సాగులో మేలైన సస్యరక్షణ, సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించేలా అవగాహన కల్పించాని ఏడీఏ మహమ్మద్ ఖాద్రి ఆర్బీకే సిబ్బందికి సూచించారు. శనివారం మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో ఏఓ మల్లి స్రవంతి ఆధ్వర్యంలో ఆర్బీకే సిబ్బందికి సమగ్ర యాజమాన్య పద్ధతులపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు పత్తి పంటను జూన్ మాసంలో నాటేలా, నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసేలా చూడాలన్నారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులను ఆర్బీకేలోనే రిజిస్టర్ చేయాలని తెలిపారు. రైతు భరోసా కేంద్రాల్లో నాణ్యమైన విత్తనాలు, ఎరువులు లభిస్తాయని చెప్పారు. ముందస్తు పంటలు వేయడంతో ఎర్ర తెగులు వ్యాప్తి చెంది నష్టపోతున్నారని, అదేవిధంగా విత్తనాల ఎంపికలో ఆలసత్వం వహించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకునేలా రైతులకు ప్రోత్సహించాలన్నారు. సాగులో వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటించి మంచి దిగుబడులు పొందాలన్నారు. రైతులు అంతర్ పంటలు, రక్షక పంటలు తప్పకుండా వేయాలన్నారు. అన్నదాత అభివృద్ధి చెందాలంటే సుస్థిర వ్యవసాయ పద్ధతులు పాటించాలని, భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ఆదోని అర్బన్: పట్టణంలోని అన్ని సబ్‌స్టేషన్లలో నిర్వహణ పనులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా ఆదివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏడీఈ పురుషోత్తం శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు బైపాస్, ఎస్కేడీ కాలనీ, రాంజల, ఇండోర్ సబ్‌స్టేషన్లలో మరమ్మతు పనులు చేపడుతున్నట్లు చెప్పారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రశాంతంగా ఓపెన్ పరీక్షలు ప్రారంభం

ఆదోని సెంట్రల్: ప్రశాంతంగా ఓపెన్ పది, ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. పట్టణంలోని పురపాలక ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలు, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఇంటర్ పరీక్షలు జరిగాయి. పదో తరగతి పరీక్షలకు 39 మంది హాజరు కావాల్సి ఉండగా 36 మంది పరీక్షలు రాశారు. ముగ్గురు గైర్హాజరయ్యారు. ఇంటర్‌లో 49 మంది ఫీజు చెల్లించగా ఇద్దరు గైర్హాజరు కాగా 47 మంది పరీక్షలు రాశారు. ప్రశాంతంగా జరిగేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు మండల విద్యాధికారి–2 శ్రీనివాసులు తెలిపారు.

రూ.1.5 లక్షల జరిమానా వసూలు

కర్నూలు (న్యూటౌన్): ఎమ్మిగనూరు నియోజకవర్గం నందవరంలో మే 27వ తేదీ అక్రమంగా గ్రావెల్ తవ్వి తరలించిన 8 ట్రాక్టర్లు, ఒక జేసీబీని రెవెన్యూ సిబ్బంది సీజ్ చేసిన విషయం తెలిసిందే. వాటిని గనులశాఖకు అప్పగించారు. శనివారం గనులశాఖ అధికారులు ఒక్కో ట్రాక్టర్‌కు రూ.10 వేల చొప్పున రూ.80 వేలు, జేసీబీకి రూ.25 వేలు మొత్తం రూ.1.5 లక్షలు జరిమానా వసూలు చేసి ట్రాక్టర్లను, జేసీబీని విడుదల చేసినట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ టి.రాజశేఖర్ తెలిపారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశాలు

కోసిగి: స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో ఖాళీగా ఉన్న సీట్లకు ఈనెల 7వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ సమీరారెడ్డి తెలిపారు. 7వ తరగతి, 9వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఈనెల 8వ తేదీన ఉదయం 10 గంటల నుంచి 11.30 గంటల వరకు పాఠశాలలోనే ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు.

నకిలీ విత్తన విక్రయాలను అరికట్టాలి

ఎమ్మిగనూరుటౌన్: రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని పట్టణంలో కొందరు వ్యాపారులు నకిలీ విత్తనాలను విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని.. వాటిని అరికట్టాలని అఖిలభారత రైతు కూలీ సంఘ నాయకులు రాజు, ఏసేపు, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ కోరారు. ఈ మేరకు శనివారం వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఏడీఏ ఖాద్రీకి వినతిపత్రం అందజేశారు.

ఘర్షణకు పాల్పడితే కఠిన చర్యలు


మాట్లాడుతున్న సీఐ ప్రసాద్

కోసిగి: ఎన్నికల కౌంటింగ్ రోజున ప్రతి ఒక్కరూ శాంతియుతంగా నడుచుకోవాలని సీఐ ప్రసాద్, ఎస్ఐ సతీష్‌కుమార్ కోరారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఘర్షణలకు తావులేకుండా గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉండేలా అందరూ సహకరించాలని కోరారు. ప్రజలు, నాయకుల్లో మార్పు రావడంతో ఎన్నికలు సజావుగా జరిగాయన్నారు. అలాగే కౌంటింగ్ నాడు ఎవరు గెలిచినా, ఓడినా ప్రజల తీర్పును స్వాగతించాలన్నారు. ఘర్షణలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అలాగే 144 సెక్షన్ అమల్లో ఉంటుందని.. మంగళవారం వారపుసంత మార్కెట్, పశువుల సంతమార్కెట్, వ్యాపార దుకాణాలు, హోటళ్లు బందు పాటించాలని సూచించారు. రోడ్లపై గుంపులుగా తిరగరాదని తెలిపారు. ఏఎస్ఐలు నాగరాజు, విజయ్‌కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో ముమ్మరంగా కార్డన్ సెర్చ్

- రికార్డులు సరిగ్గా లేని 45 బైక్‌లు సీజ్


బసాపురంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

ఆదోని రూరల్: మండలంలోని 104బసాపురం, నాగనాథనహళ్లి గ్రామాల్లో శనివారం ఆదోని రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐలు, పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. కర్ణాటక మద్యం అమ్మేవారి ఇళ్లు, రౌడీషీటర్ల ఇళ్లను తనిఖీ చేశారు. రికార్డులు సరిగ్గా లేని 45 మోటార్ సైకిళ్లను సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు. గ్రామ వీధుల్లో సిబ్బందితో కవాతు నిర్వహించారు. ముఖ్యమైన కూడళ్లలో ప్రజలతో సమావేశమయ్యారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత కూడా సెక్షన్ 144 అమల్లో ఉంటుందన్నారు. గ్రామాల్లో అవాంఛనీయ ఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఫలితాలు వెలువడిన తర్వాత బాణసంచా పేల్చరాదని, గుంపులుగా ఉండకూడదని, ఊరేగింపులు చేయరాదన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.


స్వాధీనం చేసుకున్న బైక్‌లతో పోలీసులు

శుద్ధిచేసిన నీటినే సరఫరా చేయాలి


ఎస్ఎస్ ట్యాంకు వద్ద నీటిని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ నాసర రెడ్డి

గోనెగండ్ల: పరిశుద్ధమైన మంచినీటిని ప్రజలకు సరఫరా చేయాలని జెడ్పీ సీఈఓ నాసర రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం మండలంలోని అలువాల, గోనెగండ్లలోని ఎస్ఎస్ ట్యాంకులను ఆయన పరిశీలించారు. ఆయా గ్రామాల్లోని ట్యాంకుల్లో నీటిని పరిశీలించి, ప్రస్తుతం ఎంత నీరు ఉంది.. ఎన్ని రోజుల వరకు వస్తాయి.. ఫిల్టర్ బెడ్లు పనిచేస్తున్నాయా? ఎంతమంది సిబ్బంది పనిచేస్తున్నారు? తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. రోజు మార్చి రోజు నీటిని సరఫరా చేయాలన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు క్లోరినేషన్ చేసిన శుద్ధమైన నీటినే సరఫరా చేయాలని తెలిపారు. నీటి సరఫరాలో నిర్లక్ష్యం వహించొద్దని సూచించారు. ఏఓ జితేంద్ర, ఈఓఆర్డీ నాగేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరెడ్డి, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, గోనెగండ్ల ఇన్‌చార్జ్ ఈఓ సతీష్, మురళి నాయుడు, రంగస్వామి పాల్గొన్నారు.

స్నేహితునికి మేమున్నామంటూ ఆర్థిక సాయం


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఉరుకుందుకు నగదు అందజేస్తున్న స్నేహితులు

కోసిగి: మండల పరిధిలోని డి.బెళగల్ గ్రామానికి చెందిన కురువ ఉరుకుందు కాలు చేయి పడిపోయి కర్నూలు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. శనివారం అతని పాఠశాల స్నేహితులు పరామర్శించారు. మేమున్నామంటూ రూ.30 వేలు ఆర్థికసాయం అందించారు. దివ్యాంగుడైన ఉరుకుందు డిగ్రీ, బీఈడీ పూర్తి చేశాడు. ఊళ్లోనే ఇంటి వద్ద ట్యూషన్ చెబుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇటీవల ఉన్నటుండి హైబీపీ రావడంతో కాలు చేయి పడిపోయింది. దిక్కుతోచని స్థితిలో కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో చేరారు. ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో మూడు రోజులుగా ఐసీయూలో ఉంచడంతో ఆ కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన చెందారు. విషయం తెలుసుకున్న పదో తరగతి చదివిన తోటి స్నేహితులు రామకృష్ణ, చిదానంద, రామాంజనేయులు, దినేష్, హనుమంతు, హుసేన్‌బాషా శనివారం అతన్ని పరామర్శించి ఆర్థిక సాయం చేసి పెద్ద మనసు చాటుకున్నారు.